కనులపండువగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

కడ్తాల్, మార్చి 28ః తలకొండపల్లి మండలంలోని దేవుని పడకల్ గ్రామంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఆలయంలో శ్రీదేవి, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి –అనిత దంపతులు కల్యాణంలో పాల్గొన్ని స్వామి వారికి పూజలు నిర్వహించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

మంచాలలో వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

మంచాల, మార్చి 28 : గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో బాలశంకర్ అన్నారు. గురువారం మంచాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో తాగునీటి సమస్య పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నీటి వృథాను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వేసవి కాలం ముగిసే వరకు అధికారులకు సహకరించాలని కోరారు. నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజు, ఈవో ఆర్డీ తేజ్‌సింగ్, ఏఈ స్రవంతి, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటేసిన ప్రజాప్రతినిధులు

కడ్తాల్, మార్చి 28 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా శాసన మండలికి గురువారం నిర్వహించిన ఉప ఎన్నికలో మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. షాద్‌నగర్ పట్టణంలోని ఫరూఖ్‌నగర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మండలంలోని 11 మంది ప్రజాప్రతినిధులు ఓటు వేశారు. ఓటు వేసిన వారిలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీలు లచ్చిరాంనాయక్, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్, రాములుగౌడ్, మంజుల, ప్రియ, నిర్మల, ఉమావతి ఉన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి
- సీఆర్‌పీఎఫ్ బలగాలతో వీధుల్లో ఫ్లాగ్‌మార్చ్

మంచాల, మార్చి 28 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మహేశ్వరం జోన్ డీసీపీ సునీతా రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని ఆరుట్ల గ్రామంలో సీఆర్పీఎఫ్ బలగాలతో వీధుల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం డీసీపీ సునీతారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని, ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేయా లన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీరాజ్, మంచాల సీఐ బాబ్యానాయక్, ఎస్ఐ రవినాయక్, ఏఎస్ఐ సతీశ్, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరుట్లలో ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీసీపీ సునీతారెడ్డి

జల సంరక్షణపై అవగాహన

పెద్దఅంబర్‌పేట, మార్చి 28: నీరే కదా అని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలకు మిగిలేది కన్నీరేనని గాంధీ సంస్థల చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్‌రెడ్డి అన్నారు. కుంట్లూరు– పెద్దఅంబర్‌పేట మార్గంలోని నారాయణ కాలేజీ ఐఏఎస్ అకాడమీలో గురువారం ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని జలమండలి, గాంధీజ్ఞాన్ ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో జల సంరక్షణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులతో పాటు ఇంకుడు గుంతల ఏర్పాటుపై చైతన్యపరుస్తున్నట్లు రాజేం దర్‌రెడ్డి తెలిపారు. రేపటి తరానికి స్వచ్ఛమైన నీరు అందించాలంటే ప్రతి ఒక్కరూ జల సం రక్షణను బాధ్యతగా తీసుకోవాలని సంస్థ వైస్ చైర్మన్ యానాల ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. నీటి వృథా ను అరికడతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గాంధీ సంస్థల ప్రిన్సిపాల్ కృష్ణయ్య, సంస్థ ప్రతినిధులు ప్రేమ్‌కుమార్, శివారెడ్డి, ప్రణీత్‌రెడి, చైతన్యరెడ్డి, భార్గవ్, సతీశ్, సాయి, రఘురాం పాల్గొన్నారు.

ఇంకుడు గుంత ఏర్పాటు చేస్తున్న గాంధీ సంస్థల ప్రతినిధులు, జలమండలి అధికారులు

నేటి నుంచి ప్రత్యేక పూజలు

ఇబ్రహీంపట్నం, మార్చి 28 : ఇబ్రహీంపట్నం పెద్దచెరువుకట్ట సమీపంలోని శేరిగూడ వద్ద పంచముఖ హనుమాన్ విగ్రహ ఏర్పాటును పురస్కరించుకుని నేటి నుంచి ప్రత్యేక పూజలు కొనసాగనున్నాయి. అఖండ ట్రస్టు ఆధ్వర్యంలో జ్ఞానసరస్వతి ఫౌండర్ సదావెంకట్‌రెడ్డి నేతృత్వంలో 108 అడుగుల భారీ విగ్ర హాన్ని శేరిగూడ సమీపంలోని ఉప్పరిగూడ ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న గుట్టపై ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరుకానున్నారు.

ఆడపడుచు వివాహానికి ఆర్థిక సాయం

కడ్తాల్, మార్చి 28 : నిరుపేద కుటుంబాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. కేశంపేట మండల పరిధిలోని తులవానిగడ్డ గ్రామానికి చెందిన బేరి సుగుణమ్మ, సుక్కయ్యల కుమార్తె శృతి వివాహానికి గురువారం రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ట్రస్ట్ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. కష్టాల్లో ఉన్న వారి బాధలను తీర్చడానికి ట్ర స్ట్ తరపున సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యు లు తిరుపతి, బుచ్చిబాబు పాల్గొన్నారు.

కుక్కను తప్పించబోయి గాయాలు

షాద్‌నగర్, మార్చి 28 : రోడ్డుపై ఉన్న కుక్కను తప్పించబోయి ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన కొందుర్గు మండలంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వికారాబాద్ జిల్లా పరిగి మండలంలోని కలాపూర్ గ్రామానికి చెందిన భీమయ్య, పెంటమ్మ తల్లీకొడుకులు. వారు బైక్‌పై కొందుర్గు సమీపంలోకి రాగానే రోడ్డుపై ఉన్న కుక్కను తప్పించబోయి కిందపడ్డారు. భీమయ్య, పెంటమ్మలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు షాద్‌నగర్ సర్కారు దవాఖానకు తరలించి.. పోలీసులకు సమాచారమిచ్చారు.

రోడ్లను ఆక్రమించిన పండ్ల వాహనాలను తొలగించాలి

ఎల్బీనగర్ , మార్చి 28 : కాలనీవాసులకు ఇబ్బందిగా మారిన పండ్ల వాహనాలను తొలగించాలని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్తా డిమాండ్ చేశారు. చైతన్యపురి మెట్రో స్టేషన్ , సర్వీస్ రోడ్డు మొదలుకుని ప్రభాత్‌నగర్, సాయినగర్ ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించి పండ్ల వాహనాలను నిలుపడంతో పాటుగా కాలనీవాసులకు న్యూసెన్స్‌గా మారడంతో గురువారం ఆయన.. కాలనీవాసులతో కలిసి అక్కడ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండ్ల మార్కెట్ నుండి చైతన్యపురి బస్టాపు వరకు పండ్ల వాహనాలను జిగ్‌జాగ్‌గా పార్కింగ్ చేస్తూ స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కల్గిస్తున్నారని ఆరోపించారు. ప్రధానంగా గుట్కాలు నములుతూ రోడ్డుపైనే ఉమ్మి వేయడంతో పాటుగా బహిరంగ మూత్ర విసర్జన చేస్తుండటంతో ఇబ్బందికరంగా మారిందన్నారు. ఈ దారిలో మహిళలు, విద్యార్థులు నడవాలంటే కూడా కష్టంగా మారిందన్నారు. సంబంధిత అధికారులు, ట్రాఫిక్ పోలీసులు వెంటనే రోడ్డును ఆక్రమిస్తూ వాహనాలు నిలుపుతున్న పండ్ల వ్యాపారులను ఇక్కడి నుండి తొలగిం చి.. స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూ డాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సుభాష్ చంద్రబోస్, రాజగోపాల్, బాలిరెడ్డి, నర్సింహారావు, గౌడ్, సురేందర్‌రెడ్డి, రమణారెడ్డి, రుద్రారపు శంకర్, వెంకట్‌రమణ, వినోద్ యాదవ్, మహేశ్ యాదవ్, అర్జున్ సింగ్, రామ్మోహన్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అంజన్‌రెడ్డి

అంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, మార్చి 28 : ఇబ్రహీంపట్నం కోర్టు పరిధిలోని న్యాయవాదులకు గురువారం జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఇబ్రహీంపట్నానికి చెందిన సీనియర్ న్యాయవాది అసోసియేషన్ అధ్యక్షుడిగా అంజన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఏ రమేశ్, ప్రధాన కార్యదర్శిగా జేపీ మహేందర్, సంయుక్త కార్యదర్శిగా ధనంజయ్య, కోశాధికారిగా జగన్‌లను ఎన్నుకున్నారు. పోటాపోటీగా జరిగిన ఎన్నికల్లో అంజన్‌రెడ్డి విజయం సాధించారు.

ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జగన్

మల్లెపల్లి జగన్

ఆమనగల్లు : ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మల్లెపల్లి జగన్ ఎన్నికయ్యారు. ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఎలక్షన్ అధికారి లక్ష్మణ శర్మ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా దుడ్డు ఆంజనేయులు యాదవ్, జాయింట్ సెక్రటరీగా రామకృష్ణ, లైబ్రరీ సెక్రటరీగా ఎర్రవోలు శేఖర్, కోశాధికారిగా బదరిపల్లి మధు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ శర్మ, మల్లేశ్ గౌడ్, జానకిరాములు, యాదిలాల్, న్యాయవాదులు విజయ్‌కుమార్, కొప్పు కృష్ణ, మల్లేశ్, దేవేందర్, గణేశ్, బిక్యానాయక్, మురళీకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

చేవెళ్ల రూరల్, మార్చి 28 : మండల పరిధిలోని అల్లవాడ అనుబంధ గ్రామం జాలాగూడాలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి దాతలు చేయూతనిస్తున్నారు. గురువారం కేసారం గ్రామానికి చెందిన కాసుల రాజుగౌడ్ ఆలయ నిర్మాణానికి రూ.30 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

ఓటీఎస్‌ను వినియోగించుకోండి: డీసీ



చందానగర్ సర్కిల్ పరిధిలో ఓ వాణిజ్య సంస్థ నుంచి రూ.11లక్షల ఆస్తిపన్ను బకాయి చెక్కు అందుకుంటున్న చందానగర్ సర్కిల్ ఆస్తిపన్ను విభాగం అధికారులు. ఈ సంస్థకు రూ.3లక్షలకు పైగా వడ్డీ రాయితీ లభించింది.

మియాపూర్, మార్చి 28 : ఆస్తిపన్నును సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పాటును అందించాలని చందానగర్ సర్కిల్ డీసీ వంశీకృష్ణ పేర్కొన్నారు. ఆస్తిపన్ను బకాయిలపై వడ్డీ మాఫీకి ప్రకటించిన ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చందానగర్ సర్కిల్ వ్యాప్తంగా ఓటీఎస్ కింద రూ.41 కోట్ల మేర ఆస్తిపన్ను బకాయిలు లక్ష్యంగా ఉన్నట్లు, ఇప్పటి వరకు రూ.5 కోట్ల వరకు వసూలైనట్లు డీసీ తెలిపారు. సర్కిల్ పరిధిలో మొండి బకాయిదారులకు వారెంట్‌లను జారీ చేస్తున్నట్లు, ఇప్పటికే 30కి పైగా జారీ చేశామన్నారు. ఆస్తిపన్ను బకాయిలను 90శాతం వడ్డీ రాయితీతో ఏకకాలంలో చెల్లించేందుకు ప్రకటించిన ఓటీఎస్‌కు మార్చి 31 తుది గడువు అని డీసీ వంశీకృష్ణ పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలో ఓటీఎస్ కింద నెలకొన్న ఆస్తిపన్ను బకాయిలపై రూ.20కోట్లకు పైగా వడ్డీ మాఫీ వర్తించిందన్నారు.పన్ను బకాయిదారులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పన్ను చెల్లింపులను గడువులోగా చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని డీసీ వంశీకృష్ణ కోరారు.

చౌదర్‌గూడలో ఫిరంగినాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు, ఇరిగేషన్ ఏఈ మౌనిక

ఫిరంగినాలా కబ్జాలపై చర్యలు తీసుకోవాలి

శంషాబాద్ రూరల్, మార్చి 28: ఫిరంగినాలను కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి నీరటి మల్లేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని చౌదర్‌గూడ పరిధిలో సుమారు 2కిలోమీటర్ల దూరం వరకు ఫిరంగినాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తున్నారని అన్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. నాలను పది ఫీట్లు లోతు తవ్విన రియల్ కంపెనీ ప్రతినిధులు నాలాకు ఇరువైపుల ఉన్న వారి భూమిలోకి పైపులైన్‌వేసి దారి చేస్తున్నారని తెలిపారు. షాబాద్ మండలంలోని చందన్‌వెల్లి నుంచి ప్రారంభమైన ఫిరంగినాల శంషాబాద్ మీదుగా ఇబ్రహీంపట్నం పెద్దచెరువు వరకు విస్తరించింది. రియల్ వ్యాపారులు కబ్జా చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇవ్వగా సంబంధిత శాఖ ఏఈ మౌనిక అక్కడికి చేరుకొని సీపీఎం నాయకులతో కలిసి పరిశీలించారు. అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. ఫిరంగినాలను పరిశీలించిన వారిలో నాయకులు ఏపూరి పవన్, సోగాకు సిద్ధు, మునుగాల సంజీవ, శివ, మహేశ్, తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా మినీస్టేడియం ..!

- తలుపులు, కిటికీలు మాయం
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన వైనం ..
- పట్టించుకోని అధికారులు

నిరుపయోగంగా ఉన్న స్టేడియం

స్టేడియంలో పెరిగిన చెట్లు, కలుపు మొక్కలు

కందుకూరు మార్చి 28 : అధికారుల నిర్లక్ష్యంతో లక్షల వ్యయంతో నిర్మించిన మినీ స్టేడియం నేడు నిరుపయోగంగా మారడంతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. కందుకూరు మండల కేంద్రంలో 2008లో దాదాపు రూ.46లక్షలతో మిరీ స్టేడి యం నిర్మించారు. అయితే.. అధికారులు దాని నిర్వహణను పట్టించుకోకపోవడంతో పాటు క్రీడా పోటీలు కూడా నిర్వహించడంలేదు. దీంతో కిటికీలు, తలుపులు, విద్యుత్ బోర్డులు అపహరణకు గురవడంతోపాటు నిత్యం మందుబాబులకు నిలయంగా మారిం ది. ఏ గదిలో చూసినా ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి.

వినియోగంతోకి తీసుకురావాలి..

మినీ స్టేడియాన్ని వినియోగంలోకి తీసుకురావాలి. మండలంలో అనేక మంది క్రీడాకారులు ఉన్నారు. వారికి మైదానాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అందుకోసం మినీ స్టేడియాన్ని వినియోగంలోకి తీసుకవస్తే క్రీడాకారులకు మేలు జరుగుతుంది.

– బొక్క భీక్షితోరెడ్డి, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్

రోడ్డు సౌకర్యం కల్పించాలి.

స్టేడియానికి వెళ్లడానికి కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేదు. వాచ్‌మన్ లేడు. దీంతో మందుబాబులకు అడ్డగా మారింది. అసాంఘీక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అధికారులు చొరవ తీసుకొని రోడ్డు వసతితో పాటు వాచ్‌మన్‌ను నియమించి స్టేడియాన్ని వినియోగంలోకి తీసుకరావాలి.

– జ్యోతి నర్సింహారెడ్డి, ఎంపీటీసీ కొత్తూరు

70 శాతం మందికి ఐరన్, క్యాల్షియం లోపం

నిజాం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రముఖ వైద్యురాలు డాక్టర్ నర్మదా హెచ్

సుల్తాన్‌బజార్,మార్చి 28 : పేద, ధనిక భేదం లేకుండా దేశవ్యాప్తంగా 70 శాతం మహిళలు ఐరన్, క్యాల్షియం లోపంతో బాధపడుతున్నారని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ నర్మదా హెచ్ పేర్కొన్నారు. ఈ మేరకు నిజాం కళాశాలలో కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బీమా అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. ఇటీవల గ్రామాల్లో జరిపిన ఓ అధ్యయనంలో నాలుగు పదుల వయస్సులోనే మహిళలు 80 ఏండ్ల వయసులో ఉన్నట్లుగా కనిపిస్తున్నారని, దీనికి ప్రధాన కారణం ఐరన్, క్యాల్షియం లోపమేనని అన్నా రు. ఈ విటమిన్ల లోపంతో మహిళలు రక్త హీనత, ఎముకల బలహీనత బారి న పడుతున్నారని, ఐరన్ అండ్ క్యాల్షియం సమృద్ధిగా లభించే ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల మహిళలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. 12 ఏళ్ల నుంచి 22 సంవత్సరా వయస్సు గల బాలిక ల ఆరోగ్యం పట్ల వారి కుటుంబాలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. 40 ఏండ్లు దాటిన ప్రతి మహిళా గర్భాశయ క్యాన్సర్ రాకుండా ఉండటానికి మూడు దశల్లో వ్యాక్సిన్ వేయించుకోవాలని తెలిపారు. జంక్ ఫుడ్, బేకరీ ఫుడ్ తీసుకోవడం వల్ల శరీరంలో కొవ్వు శాతం విపరీతంగా పెరుగుతుందని, థైరాయిడ్ హార్మోన్స్ ఇన్‌బాలెన్స్, డయా బేటీస్ తదితర రోగాలు వస్తాయని వీటికి దూరంగా ఉండాలని ఆమె సూచించారు. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ కోర్ట్ రిటైర్డ్ ప్రిన్సిపల్ జడ్జి ఉదయ గౌరీ మాట్లాడుతూ.. తనలో ఉన్న శక్తిని గమనించి కోరుకున్న రంగంలో అవకాశాలను వెతుక్కోవాలని విద్యార్థులను కోరారు. ప్రభుత్వ హై కోర్టు ప్లీడర్ షాజియా పర్వీన్ మాట్లాడుతూ మహిళల్లో ఎంతో శక్తి దాగి ఉందని పోరాడి ఎదగాలని అన్నారు. ఈ సంధర్భంగా ఆరుగురు మహిళా స్వీపర్లకు బహుమతులను ప్రదానం చేసి సత్కరించారు. నోవో స్పేస్ డైరెక్టర్ ఇంజినీర్ చెన్నకేశ్వరి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా, కళాశాల ఎంపవర్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ ప్రవంతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి ఉన్నారు.

ఆర్టీసీ బస్సు టిప్పర్ ఢీ.. పలువురికి గాయాలు

శంషాబాద్ రూరల్, మార్చి 28: ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో పలువురికి గాయాలయ్యా యి. శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సంఘటన జరిగింది. పోలీసుల వివరాల ప్రకా రం.. శంషాబాద్–షాబాద్ రోడ్డులో వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో షాబాద్ వైపు నుంచి వస్తున్న రాజేంద్రనగర్ డిపో బస్సును శంషాబాద్ వైపు నుంచి వెళ్తున్న టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో బస్సు ముందుభాగం ధ్వంసమైంది. కాగా డాంబర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ బోల్తాపడింది. టిప్పర్ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ క్లీయర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

బాలుడి వైద్యానికి 'నవద్వీప ఫౌండేషన్' ఆర్థిక సాయం

కొండాపూర్, మార్చి 28: కాలిన గాయాలతో చికిత్సను పొందుతున్న బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయమందించి హైటెక్‌సిటీలోని మైహోం నవద్వీప ఫౌండేషన్ తమ ఉదారతను చాటుకున్నది. బస్వరాజ్(3) ఆడుకుంటూ ఎత్తులో ఉన్న వస్తువును తీసుకునేందుకు వెళ్లి వేడి నీటి బకెట్‌లో జారి పడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడి, స్థానికంగా ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం నవద్వీప ఫౌండేషన్ రూ. 1,45,000 బాలుడి తండ్రి శాంతికుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు సామర్ల సత్యనారాయణ, శేషు కుమారి, ప్రసన్న, ప్రొఫెసర్ ప్రసాద్ రావు, డాక్టర్ రమణబాబు, రవి గంటి, సత్యానందం, వెంకటేశ్వర్లు, రాధాక్రిష్ణ, ప్రసాద్ రావు, శ్రీనివాస్‌రావు, ఆనందం, తదితరులు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి చెక్కు అందజేస్తున్న నవద్వీప ఫౌండేషన్ ప్రతినిధులు